నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 04, 2024 | www.navatelangana.com
1

జిల్లా ఉపాధ్యాయునికి రోల్ మోడల్ పురస్కారం

ఆసిఫాబాద్ : మండలంలోని మేదరిగూడ ఎంపీపీఎస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డాక్టర్ నూతి అభిలాష్‌ను తెలంగాణ రోల్ మోడల్ అవార్డు వరించింది. సాహితీ, విద్యా రంగంలో చేసిన కృషికి గాను అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ(సీతక్క) చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభిలాష్ విద్య రంగంలో మూడు ప్రపంచ రికార్డులు సాధించడం గర్వకారణమన్నారు. అవార్డు గ్రహీత అభిలాష్ మాట్లాడుతూ తెలంగాణ రోల్ మోడల్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు మరింత బాధ్యతలు పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల కోపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జీహెచ్ఎంసి చైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-వాంకిడి





టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి హరీష్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ సాయికుమార్, ఉపాధ్యక్షులుగా జమీల్, ఉపాధ్యక్షురాలిగా జె శారద, కోశాధికారిగా రాజలింగు, కార్యదర్శులుగా డి రవికుమార్, శ్రుతిక, మహేష్, పవార్ ప్రియాంక, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కోవ దశరథ్, రవి, మహిళా కమిటీ కన్వీనర్‌గా జి శిరీష, కో కన్వీనర్‌గా దివ్య, లక్ష్మిలను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి ఇందూరావు, జిల్లా బాధ్యులు అభినందించారు.

రోడ్డు వెంబడి నిలిచిపోయిన పత్తి వాహనాలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఇంటర్నెట్ కారణంగా పత్తి తూకాలు నిలిచిపోవడంతో మండల కేంద్రంలోని శ్రీరామ కాటన్ జిన్నింగ్ మిల్లులో ముందు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పత్తి కొనుగోలులో ఇంటర్నెట్‌తో పాటు సిసిఐ సాఫ్ట్‌వేర్ సమస్యతో ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో జిన్నింగ్ మిల్లు నుండి సుమారు కిలోమీటర్ మేరకు పత్తి లోడింగ్ వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే జిల్లింగ్ మిల్ యాజమాన్యం, సీసీఐ సిబ్బంది స్పందించి సమస్యలు పరిష్కరించి పత్తి కొనుగోలు ప్రారంభించారు. సమస్య తలెత్తడంతో సాయంత్రం వరకు రైతులు జిన్నింగ్ మిల్ ఎదుట పడిగాపులు కాశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన నిందితుడి అరెస్ట్



నవతెలంగాణ-నేరడిగొండ

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూర్ జిల్లా చౌడేపల్లికి చెందిన కళ్యాణ్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కుమారి గ్రామానికి చెందిన బాధితుడు 2021లో అనంతపూర్ రత్న డిఫెన్స్ అకాడమీలో కళ్యాణ్ పరిచయమయ్యాడు. ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, తనకు బెంగుళూర్‌లో అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పాడు. బాధితుడు నమ్మి రూ.13లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం బాధితుడు కళ్యాణ్‌కు ఫోన్ ద్వారా సంవత్సరం పాటు సుమారు రూ.5లక్షల78వేల586 చెల్లించాడు. తప్పుడు కాల్ లెటర్ ఇచ్చి మోసం చేశాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు మంగళవారం నిందితుడు కళ్యాణ్‌ను ఆదిలాబాద్‌లో చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద నుండి రూ.20లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నందుకు ఎస్పీ గౌస్ అలం ఎస్సై శ్రీకాంత్‌ను అభినందించారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల కార్యదర్శి ఝాడే నాందేవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్మికుల ఆధ్వర్యంలో ఏంఈఓ అనితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వంట సరుకులు, కోడిగుడ్లు ప్రభుత్వాలే సరఫరా చేయాలన్నారు. మార్కెట్‌లో కోడిగుడ్డు ఏడు రూపాయలకు లభిస్తుంటే ప్రభుత్వం ఐదు రూపాయలు మాత్రమే చెల్లిస్తుందన్నారు. బయట అప్పులు చేసి పిల్లలకు వండి పెడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస గౌరవ వేతనం పదివేల రూపాయలు పెంచుతామని హామీ ఇవ్వడం జరిగిందని, దాన్ని వెంటనే అమలు చేయాలని, వంట పాత్రలు, సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కార్మికులు ఝాడే తాయి, సక్రవంతి, సునీత, జైతుబాయి, సమాధాన్, దేవ్‌రావ్, పిరాజీ, దేవిదాష్ ఉన్నారు.

ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-మందమర్రి

ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించి, పిపిఈ కిట్స్ ఆప్రాన్స్, గన్ షూస్, హ్యాండ్ గ్లౌజులు, సబ్బులు, నూనెలు అందజేసి ఉత్తమ కార్మికులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ అధికారులతో చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుమతి, రెవెన్యూ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సందీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ సమీర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు రాణి, శ్రీనివాస్, లక్ష్మీరాజు, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా కోఆర్డినేటర్ రఘురాం, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డిసెంబర్ 6 నుండి జరుగనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీలలో వైద్య పరీక్షల నిమిత్తం హాజరు కావాలని, నూతన ధృవపత్రం, కాలపరిమితి ముగిసిన ధృవపత్రం పున:రుద్ధరణ కొరకు అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 6న మూగ, చెవుడు(50), 11, 16, 20, 28 తేదీలలో, శారీరక వికలాంగులు-ఆర్థో (70), 17న మానసిక వికలాంగులు (50), 19న కంటి చూపు (40) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకొని వెయిటింగ్ లిస్ట్‌లో ముందు ఉన్న వారి మొబైల్ నంబర్‌కు సదరం క్యాంపుకు రావలసిన తేదీ మెసేజ్ వస్తుందని, వారు మాత్రమే ఆయా తేదీలలో సకాలంలో శిబిరానికి సంబంధిత పత్రాలతో హాజరు కావాలని, కాలపరిమితి ముగిసిన వారు రెన్యువల్ కొరకు మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.పద్మ స్పష్టం చేశారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీ, సర్‌సిల్క్, మండలంలోని ఈజ్‌గాం, భట్టుపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ముందు ఆశా వర్కర్‌లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశ వర్కర్‌లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్‌లకు రూ. 50 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని అన్నారు. ఈ డిమాండ్లతో బుధవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద సంఖ్యలో ఆశ వర్కర్లు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆరోగ్య కేంద్రాల ఆశ వర్కర్‌లు మాధవి, పంచశీల, భాగ్య, జమీల, సరస్వతి, జల్పన, గౌరుబాయి, సుమలత, రమాదేవి, వాణి, శకుంతల, స్వప్న, సురేఖ, జరీనా పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రత్యేక చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దివ్యాంగుల పరిరక్షణ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, దివ్యాంగులకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సమస్యలపై ఆన్‌లైన్‌లో ఉన్న నంబర్‌కు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసినట్లయితే పరిష్కారంపై ప్రత్యేక దృష్టి తీసుకుంటామన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం ట్రై సైకిళ్ల అందించడం జరుగుతుందని తెలిపారు. సంకల్పం, మనోధైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. దివ్యాంగులు అందరితో సమానంగా రాణించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. దివ్యాంగులుగా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి ఎన్నో సేవలు అందిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఈడి దుర్గాప్రసాద్, ఎస్‌సి అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6000 పింఛన్ ఇవ్వాలి



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా దివ్యాంగులకు పింఛన్ రూ.6000 ఇవ్వాలని మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ వికలాంగుల వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి జీవన ఆధారం లేక కుటుంబంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని, అర్హులైన వికలాంగులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. భూమి లేని నిరుపేద వికలాంగులకు ఒక్కొక్కరికి 5ఎకరాల భూమి పంపిణీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వికలాంగులతోనే భర్తీ చేయాలన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల వేదిక మండల అధ్యక్షులు నగురారుపు సుమన్, ఉపాధ్యక్షులు ముంతమల్ల రోజా, ప్రధాన కార్యదర్శి పోలగాని తిరుపతి, కార్యదర్శులు కనుకుంట్ల కళావతి, కనకుల సంతోష్, గౌరవాధ్యక్షులు రాజమల్లు, బోగె పోశం, షెఫిబాబా, రాజన్న, సునీత పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు చేయూతనందిస్తూ ఆదుకోవలసిన బాధ్యత సమాజంపై ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కాసిపేట-2 ఇంక్లైన్ గని వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్ ఆధ్వర్యంలో సింగరేణి తరపున దివ్యాంగులకు లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు భోగే పోశం, కార్యదర్శి కంచర్ల రాజమల్లు, ఏపీఎం వెంకటేష్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని బైటా సెంటర్లో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రమేష్ బాబు మాట్లాడుతూ మండల కేంద్రంలో బైటా సెంటర్ ఉందని, దాన్ని వికలాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ సుజాత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, సీఆర్‌పి శ్యామ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ డేలో కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని యాపల్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో మంగళవారం కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత దినం జరుపుకున్నారని, ఈరోజు న్యూట్రిషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. బుధవారం ఆరోగ్య మానసిక, గురువారం మాదకద్రవ్యాలు, శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిగత వికాసం జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలన్నారు. ఉదయం మైండ్ ఫ్రెష్‌గా ఉండడంతో పాఠశాలకు వచ్చిన తరువాత ప్రార్థన అనంతరం పది నిమిషాలు ఈ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. పిల్లల బాగోగులు చూడడానికి ఫుడ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశానుసారం హెడ్ మాస్టర్, ఇద్దరు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దీనిలో భాగస్వాములుగా ఉండి రోజువారీ మానిటరింగ్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం, స్టోర్ రూం, సరుకులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డిఎంహెచ్ఓ నరేందర్, శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల హెచ్ఎంపై ప్రజా సంఘాల ఫిర్యాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై ప్రజా సంఘాల నాయకులు కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని గత నెలలో అదనపు కలెక్టర్ పర్యటనలో కూడా ఈ విషయం వెల్లడైందన్నారు. జిల్లా స్థాయి అధికారుల తనిఖీలతో కూడా ఆశ్రమ పాఠశాలల్లో మార్పులు రావడం లేదన్నారు. ఇప్పటికే కలుషిత ఆహారంతో జిల్లాలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంఘటనలు జరిగినప్పటికీ అధికారుల మొద్దు నిద్ర వీడడం లేదన్నారు. మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో కుళ్లిపోయిన కూరగాయలతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం అదనపు కలెక్టర్ ప్రత్యక్షంగా గుర్తించారని తెలిపారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని గత నెల 30న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోలేదని తెలిపారు. వెంటనే ఆయనను విధుల నుండి సస్పెండ్ చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొడిసెల కార్తీక్, గేడం టికనంద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, వడ్లూరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన అడ్డగింత



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని రేగులగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలకు బీఆర్ఎస్వీ నాయకులు సందర్శనకు వెళ్లగా లోపలికి రాకుండా తాళలు వేయించడం దుర్మార్గమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మండి పడ్డారు. మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మండలంలోని రేగులగూడ ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్లారు. దీంతో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, సిబ్బంది లోపలికి రాకుండా తాళాలు వేశారు. దీంతో ఆశ్రమ పాఠశాల గేటు ముందు బీఆర్ఎస్వీ నాయకులు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ శాంతియుతంగా సామరస్యంగా పాఠశాలలకు వెళ్లి సమస్యలు తెలుసుకునే సందర్భంగా గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల గేట్లకు తాళాలు వేయడం దుర్మార్గమన్నారు. నిర్బంధించిన మాత్రాన పోరాటం ఆగదని, రాజ్యాంగ విరుద్ధంగా ప్రిన్సిపాళ్లు లోపల నుంచి బయటకు వచ్చి గేటు బయటనే నిలబెట్టి మాట్లాడమంటే రేవంత్‌రెడ్డి భయపడుతున్నట్టేనన్నారు. గురుకుల పాఠశాలల్లో, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల పరిస్థితి చూస్తే కన్నీళ్లు వస్తున్నాయన్నారు. వసతులు కల్పించే వరకు రేవంత్‌రెడ్డిపై పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు అరుణ్, మండల అధ్యక్షులు మారం మహేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆడే బాదు, మాజీ ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బోయిని తిరుపతి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ సుమన్, వేటేల్లి నరేష్ యాదవ్, కైలాష్, పవన్ కళ్యాణ్, రోషన్, సాయికుమార్, హర్షవర్ధన్, కార్తీక్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లిలోని వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న (పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, శానిటైజేషన్, స్వీపర్లు) వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్ఎస్‌వి క్రియేషన్స్ ఏజెన్సీలో వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారని, జూన్ నెల నుంచి నేటి వరకు ఆరు నెలల గడిచినా వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ఐడి కార్డులు, యూనిఫామ్ కూడా సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ప్రతినెలా సకాలంలో రాకపోవడంతో కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు, ఇంటి అద్దెలకు రోజువారి ఖర్చులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, అన్వర్, సాయి శ్రీకాంత్, మల్లీశ్వరి, దీప, తిరుమల, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ కళ్యాణానికి కళ్యాణ లక్ష్మి పథకం ఆసరాగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పూర్తిస్థాయిలో అందజేయడం లేదని, దీనిపై అసెంబ్లీ సమావేశంలో ప్రజల గొంతుకగా మాట్లాడతానని అన్నారు. అనంతరం పలువురు రైతులు రుణమాఫీ కాలేదని వినతులను అందజేశారు. మండల వ్యవసాయ అధికారి ప్రేమలతను ఎంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇందారపు పుష్పలత, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్ముల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ దుర్గ మోతీరామ్, మాజీ సర్పంచ్ గెడెం శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవతెలంగాణ-కెరమెరి



విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అంజత్ పాషా అన్నారు. బుధవారం మోడీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మెనూ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. నిల్వ ఉన్న సరుకుల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. వంటకు తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి ప్రవీణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



సోన్ మండలంలోని కడ్తాల్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. పుట్టి సుదీర్, పుట్టి హరీశ్‌కు చెందిన వరి గడ్డి కట్టలను షెడ్డు వేసి ఉంచారు. కాగా సోమవారం అర్ధరాత్రి షెడ్డుపై ఉన్న విద్యుత్ తీగ తెగిపడి మంటలు చేలారేగాయి. దీంతో గడ్డి వాముకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ రెండు లోపు వచ్చిన దరఖాస్తులను కంప్యూటరైజ్డ్ చేయాలని ఆదేశించారు. దీంతో మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల నమోదు చేయుటలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సమీర్ ఆధ్వర్యంలో దగ్గరుండి ఆన్‌లైన్ నమోదును యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.



సకలాంగులతో సమానంగా రాణిస్తున్న దివ్యాంగులు

- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులను ప్రోత్సహిస్తే సకలాంగులతో సమానంగా రాణిస్తారని ఆ దిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మహిళ స్త్రీ శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు దివ్యాంగులు, రాష్ట్ర స్థాయిలో క్రీడ పోటీల్లో గెలుపొందిన వారిని కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ దివ్యాంగులు సవ్యాంగులతో పాటు సమానంగా రాణించగలరన్నారు. వారిని ప్రోత్సహిస్తు మనోధైర్యం ఇస్తే చాలన్నారు. ఇటీవల ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన క్రీడ పోటీల్లో దివ్యాంగులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో పాల్గొని గెలిచారన్నారు. దివ్యాంగులకు టాలెంట్ ఉంటుందని, దాన్ని గుర్తించడంతో పాటు ప్రోత్సహం అందిస్తే వారు కూడా రాణిస్తారన్నారు. మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ట్రైసైకిళ్లను పంపిణీ చేశామని, 18 మందికి స్వయం ఉపాధిలో రాణించేలా సహకారం అందించామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా బ్యాంకర్లే వారి వద్దకు వచ్చేలా చూడాలని సూచించారు. ఇదే విషయం అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని తెలిపారు. పేద దివ్యాంగులకు తొలుత ఇండ్లు ఇచ్చిన తరువాతనే వేరే వారికి అందిచేలా ప్రణాళికలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఏ అవసరం ఉన్న దివ్యాంగుల కోసం ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, ఆర్డీఓ వినోద్ కుమార్, డీడబ్ల్యూఓ సబిత, డీఈఓ ప్రణీత, డీఆర్డీఓ సాయన్న, ఏసీడీపీ మిల్క, అధికారులు, సిబ్బంది, దివ్యంగులు ఉన్నారు.

నిర్మల్ : దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ సంఘ భవనంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఫైజాన్ అహ్మద్, సీనియర్ సివిల్ జడ్జి రాధికలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికై ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నాయని, వాటిని వినియోగించుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని తెలిపారు. అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు కలెక్టర్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ రాజేందర్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఎస్పీ ప్రభాకర్, ఏసీడీపీఓ నాగలక్ష్మి, సంక్షేమశాఖ అధికారులు, దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకులు, దివ్యాంగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా బండారి శ్రీనివాస్, సౌజన్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకొని వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ కైలాస్, ఉపాధ్యాయురాలు అరుణ, ఐఈఆర్పీ కుర్సెంగ రమేష్, ఆత్రం అర్జున్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు రత్నమాల పాల్గొన్నారు.

కేబీ కాంప్లెక్స్‌లో..

మండలంలోని కేబి కాంప్లెక్స్ ప్రాంగణంలో వికాసం పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా పాల్గొని, కేక్ కట్ చేసి విద్యార్థులకు దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ వికాసం పాఠశాలలో ప్రభుత్వం తరుపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ, సబ్ కలెక్టర్, ఏటీడీఓ, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : వికలాంగులమని జీవితంలో ఎల్లప్పుడు ఆధైర్య పడొద్దని మండల తహసీల్దార్ మెంగు ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్థానిక యూపీఎస్ పాఠశాల-2లో జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు శారీరకంగా అంగవైకల్యం ఉండవచ్చునని కానీ వారి మేధోశక్తి అపరిమితంగా ఉంటుందన్నారు. సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వికలాంగుల కోసం ప్రభుత్వం విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. సమాజం వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, ఎంఈఓ మాను కుమార్, సిబ్బంది అనురాధ, రాథోడ్ అనిల్ పాల్గొన్నారు.

ఖానాపూర్ : వికలాంగుల సమస్య పరిష్కరించాలని వికలాంగుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సంఘం ఆధ్వర్యంలో వెళ్లి తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అంతేకాకుండా వికలాంగులకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ అందే విధంగా చూడాలని అన్నారు. కుటుంబంలో ఒకరు వికలాంగులు అయితే ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేయాలని అన్నారు. ఏ లాంటి షరతులు లేకుండా బ్యాంకు నుంచి రూ.3 లక్షలు రుణం అందజేయాలని అన్నారు. ఇండ్ల స్థలాలు లేనివారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని సూపర్ లగ్జరీలో 50శాతం రాయితీతో ప్రయాణించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పోశెట్టి, శ్రీనివాస్, నర్సయ్య, జంపల గంగాధర్, మాదాస్ పరమేశ్వర్, రాజన్న పాల్గొన్నారు.



నిర్మల్



ఉట్నూర్

పారిశుధ్య కార్మికులకు స్వెటర్లు పంపిణీ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులకు మంగళవారం బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, ఫూలే సంఘం అధ్యక్షుడు గాజుల పోతన్న చేతుల మీదుగా స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు లేకుంటే మనం లేమని, వారు చేసే సేవలు ఎనలేనిది అన్నారు. అనంతరం సొనాల గ్రామంలోని కోస్మెట్టి దేవిదాస్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, సొనాల గ్రామాధ్యక్షులు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి చంటి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ ఇస్రు పటేల్, నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, కసిరె పోతన్న, అంకుష్, బలిరాం, హరిసింగ్, పవన్, రాజేష్, అమృత్ రావు, భోజన్న పాల్గొన్నారు.

2కే రన్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 3వరోజు మున్సిపల్, జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2కే రన్ ఉదయం పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. ప్రతి అధికారి జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అదనపు కలెక్టర్ పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈఓ పి.రామారావు, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, డీసీఓ రాజమల్లు, తహసీల్దార్ రాజు, గిరిజన క్రీడల అధికారి భుక్యా రమేష్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి కోసం విద్యార్థుల అవస్థలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ మండలంలోని డ్యాంగాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో వర్కర్లు చేయాల్సిన పనిని విద్యార్థులతో చేయిస్తున్నారు. విద్యార్థులు నీటి కోసం ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు పైకి ఎక్కి నీటిని తోడుతున్నారు. విద్యార్థులతో పనులు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యహ్న భోజనాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. భోజనం ఫుడ్ పాయిజన్ కాకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటన్న, చందు, మల్లేష్, నర్సయ్య, ప్రధాన ఉపాధ్యాయులు సునీల్, గంగారాం పాల్గొన్నారు.

ఎస్సై శివరామ్‌కు సన్మానం



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శివరామ్‌ను మంగళవారం బీఆర్ఎస్ మండల నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై శివరామ్ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పెంటన్న, ఇక్బాల్, చందు, సూర్యకాంత్, విజయ్, లస్మన్న, ప్రభాకర్, నర్సయ్య, సునీల్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందని, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మలేష్ యాదవ్ అన్నారు. మంగళవారం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్రంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రజలందరూ నానా అవస్థలు పడ్డారని ఆరోపించారు. అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సతీష్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నచ్చన్ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, లింగాపూర్ మాజీ సర్పంచ్ బాలవ్వలచ్చన్న, కొత్త మద్దిపడగ మాజీ సర్పంచ్ రాజమణి ఇందూర్, కడెం పట్టణాధ్యక్షులు వాజీద్ ఖాన్, మైనారిటీ మండలాధ్యక్షులు బబ్లు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బ్రహ్మచారి, రాజ నర్సయ్య రహీం, ధర్మయ్య, ముస్కు రాజు, కోల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని స్వర్ణ ఆశ్రమ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలపై ఎస్సై శ్రీకాంత్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గుర్తుతెలియని ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్ వచ్చిన వాటి బారిన పడినపుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని అన్నారు. ఈ విషయం అందరికి తెలియచేయాలని సూచించారు. ఆపదలో ఉన్నపుడు పోలీస్ సహాయం కోసం డైల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. మీ కోసం షీటీమ్స్ పనిచేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా చదువుపైన దృష్టి సారించి, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, పోలీస్ కానిస్టేబుళ్లు ఆకాష్, వినోద్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రం

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం అర్బన్ డే ను నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్యులు పరీక్షించి మందులను అందించారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఫుడ్ మేళాలలో వంటల ప్రదర్శనను తిలకించారు. పలు రకాల వంటకాల రుచులను చూసి అభినందించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించి మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండటంలో పారిశుధ్య కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. వారు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులకు ఇచ్చే మందులను నిరంతరం వాడాలని సూచించారు. వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తన దృష్టికి వచ్చిందని, జనరల్ ఫండ్‌లో మున్సిపల్ కార్మికుల వేతనాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాతపూర్వకంగా ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ వచ్చేలా కూడా కృషి చేస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి శక్తి క్యాంటిన్లు, ఇతర రంగాల్లో రాణించేలా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, ఇన్‌చార్జి కమిషనర్ తిరుపతి, మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

7న ఆటోలు బంద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడం లేదని ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న ఆటో, క్యాబ్, వ్యాన్ తదితర వాహనాల బంద్ నిర్వహిస్తున్నామని యూనియన్ జిల్లా అధ్యక్షులు దళిత్ టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆటో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ బందులో ఆటో, వ్యాన్, టాక్సీ వాహనాలన్నీ బందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం మోటార్ కార్మికుల సమస్యలను విస్మరించిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఆటో మెయింటెనెన్స్ కోసం సంవత్సరానికి రూ.12 వేలు, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న తమకు నెలకు రూ.6వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు రమేష్, నరేష్, సయ్యద్ అనీష్, షేక్ ధనిష్, మహమ్మద్ షహబాజ్, షేక్ ఆసిఫ్, షేక్ జావిద్, బుచ్చిరాం, సద్దాం, సాయి, ఇర్ఫాన్, రఫిక్, అవినాష్, రంజిత్ పాల్గొన్నారు.

కౌలు రైతుల ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

హైదారాబాద్‌లో బుధవారం నిర్వహించే కౌలు రైతు ప్రజాదర్బార్‌ను విజయవంతం చేయాలనీ రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న అన్నారు. మంగళవారం మండలంలోని కనుగుట్ట గ్రామం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులను గుర్తించి వారికీ రైతు భరోసాతో పాటు రైతు బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే కౌలు రైతుల ప్రజాదర్బార్‌ను మండల రైతులు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపుగా 75 మంది కౌలు రైతులను తీసుకొని వెళ్లడం జరుగుతుందనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలలో భాగంగా కౌలు రైతులకు రైతు భరోసా నిధులు ఇస్తామన్నారని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తయి రబి సీజన్ ప్రారంభమవుతుందన్నారు. ఇంతవరకు కూడా రైతు భరోసా కేటాయించడం లేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ హక్కు పత్రాలు ఉన్న ప్రతి రైతుకి రైతులకి సంబంధించిన ప్రభుత్వంలో ఈ కౌలు దారి చట్టం అమలు కాకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు భీమా రాజు, రాజేందర్, గణేష్, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కొమురయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అగర్‌గూడ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ యువత గుట్కా, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, యువత చదువులో ముందుండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు. అలాగే వాహనదారులు సరైన వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. మండలంలో పులి సంచారం నేపథ్యంలో మండల ప్రజలు చేను పనులకు వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని, అటవీ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

ప్రభుత్వం సర్వేల డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-బెజ్జూర్



ఆశా వర్కర్లకు లెప్రోసి, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఆశ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సరోజినీ దేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్ల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఫార్మసిస్ట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18000, సర్వే పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాల ముందు యూనియన్ ఆదేశాల మేరకు సర్వే డబ్బుల కోసం ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ధర్నా కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

క్రీడారంగంలో జిల్లాను ముందుంచాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రీడరంగంలో జిల్లాను ముందుంచే విధంగా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచిన, అలాగే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన హ్యాండ్ బాల్ అసోసియేషన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన గిరిజన క్రీడ పాఠశాల విద్యార్థినులను జిల్లా క్రీడల అధికారిని రమాదేవితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు కావలసిన వసతులు కల్పించాలన్నారు. క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. అభివద్ధి చెందిన జిల్లాలతో క్రీడారంగంలో పోటీపడాలని సూచించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎసిఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఎటీడీఓ చిరంజీవి, హెచ్ఎం మనోహర్, వార్డెన్ సాయి బాబా, ఖోఖో తిరుమల్, పీడీ రవి, క్రీడ పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నూరు శాతం రైతు రుణమాఫీ కాలేదు

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కౌటాల

నూరు శాతం రైతు ఋణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రుణమాఫీ కాని రైతులతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూరు శాతం రూ. రెండు లక్షల లోపు రుణమాఫీ పూర్తయింది అనడం హాస్యాస్పదంగా ఉందని, ఈ సంవత్సరపు అతిపెద్ద జోక్ ఇదే అని ఎద్దేవా చేశారు. మండలంలోని ముత్యంపేట గ్రామీణ బ్యాంకులో 40 శాతం మందికి కూడా రుణమాఫీ పూర్తి కాలేదని, అలాగే ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లెలో కూడా పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదని నిరూపించడానికి సిద్ధమని సవాల్ చేశారు. వెంటనే విజయోత్సవాల పేరిట సమయం వృధా చేయకుండా ప్రజా సంక్షేమం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు తిరుపతిగౌడ్, మేకలు తిరుపతి, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం, మాజీ జడ్పీటీసీ ఎల్ములె మల్లయ్య పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన ఆలయ కమిటీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పట్టణానికి నూతనంగా వచ్చిన సీఐ బుద్దే రవీందర్‌ను కేస్లాపూర్ ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో ఘనంగా సన్మానించారు. ప్రతి మంగళవారం ఆలయంలో నిర్వహించే మహా ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహా ప్రసాద వితరణకు తోడ్పడుతున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గణపతి, సంతోష్, శ్రీనివాస్, గురుమూర్తి సహకారంతో మహా ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మ, పిన్న వివేక్, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రమేష్, గడ్డల వెంకన్న, శ్రీనివాస్, రాధాకృష్ణ చారి, వనం మధుకర్, సుధాకర్, గిరి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-పెంచికల్ పేట్

మండలంలోని బొంబాయిగూడా గ్రామానికీ చెందిన రామగిరి బాపు ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. రామగిరి బాపు పుట్టుకతోనే రెండు కండ్లు కోల్పోయి ఉండగా ప్రమాదవశాత్తు గాయపడడంతో ఆయనకు వైద్యం చేయించుకోవడానికి సామాజిక కార్యకర్త చపిడే ప్రకాష్ విరాళం సేకరించి రూ.6 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో చౌదరి గుండయ్య, తోరె గోపాల్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిశుభ్రతలో ముందుండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిశుభ్రతలో కార్మికులు ముందుండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉత్తమంగా పనిచేస్తున్న 9 మంది కార్మికులను గుర్తించి ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ భుజంగరావుతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. నిరంతరం కార్మికులు పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. అంతకముందు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పెద్ద బాడిసె..మూగబాయె..

- దయనీయ స్థితిలో వడ్రంగులు
- యంత్రాల రాకతో బతుకులు ఛిద్రం
- ఇతర రంగాల వైపు చూపు





నవతెలంగాణ-కెరమెరి

ఒకప్పుడు వడ్రంగులకు, రైతులకు విడదీయలేని బంధం ఉండేది. పంటలు సాగు చేయాలంటే వడ్రంగులు చేసే వ్యవసాయ పనిముట్లు ఎంతో అవసరం. నాడు తొలకరి చినుకులు పడే వరకు వడ్రంగులు చాలా పనుల్లో నిమగ్నమై ఉండే వారు. తెల్లవారు జామునే బాడిసె, ఉలి, గూటం, సుత్తి, పిదసాని, రంపం తదితర పనిముట్లు చేతబట్టి కాడి, నాగలి, గుంటుక, దంతె లాంటి పనిముట్ల తయారు చేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారిపోయాయి. దుక్కి దున్నే దగ్గర నుంచి పంట కోసే వరకు అన్ని యంత్రాలు రావడంతో వడ్రంగుల పరిస్థితి దయనీయంగా మారింది. పూర్వం గ్రామాల్లో వస్తు మార్పిడి పద్ధతి ఉండేది. అంటే రైతన్నకు కావాల్సిన పనిముట్లు వడ్రంగులు తయారు చేసి ఇస్తే.. పంట చేతికొచ్చిన తర్వాత ఇంతా అని లెక్క చేసి అంత విలువ చేసే ధాన్యం వడ్రంగులకు ఇచ్చేవారు. ఆ ధాన్యంతో వడ్రంగులు సంవత్సరానికి సరిపడా తినడానికి ధాన్యం నిల్వ చేసుకుని.. మిగిలితే ఇతర అవసరాలకు విక్రయించుకునేవారు. ఇలా ఆ రోజుల్లో వడ్రంగుల జీవితాల్లో వెలుగులు ఉండేవి. కాలానుగుణంగా యాంత్రీకరణ కారణంగా వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు రావడంతో వడ్రంగులకు కుల వృత్తి లేకుండా పోయింది. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

జీవన శైలి తారుమారు

వడ్రంగుల జీవనశైలి తారుమారైంది. ఎంతో మంది ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే పరిస్థితుల ప్రభావం కారణంగా పనులు తగ్గాయి. దీంతో కుల వృత్తిని నమ్ముకున్న వారికి భవిష్యత్తు లేదని ఇతర రంగాలవైపు చూస్తున్నారు. అంతే కాకుండా వడ్రంగులకు పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. పనులు చేస్తున్నప్పుడు దుమ్ము, పొట్టు వస్తుండంవల్ల దగ్గు, ఆయాసంతో పాటు కంటిచూపు మందగించడం, నడుము, వెన్నెముక, మోకాళ్లు, కీళ్ల నొప్పుల వంటి జబ్బులు వస్తున్నాయి. దీంతో పాటే పనులు చేస్తున్న సమయంలో చేతులు, కాళ్లకు గాయాలై అవిటివారిగా మారిన సందర్భాలున్నాయి.

వడ్రంగులు తయారు చేసేవి


వడ్రంగులు ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన పనిముట్లన్నింటినీ తయారు చేస్తారు. నాగలి, గుంటుక, గొర్రు, దంతే, విత్తనపు బొట్టలు, గొడ్డలి, కొడవలి , ఎడ్లబండ్లు, చక్రాలు మడిగెం మొద్దు, గొడ్డలి కామ, పారకామ, డేకీస పారకామ, ఇరుసు తదితర పనిముట్లను రైతులకు కావాల్సిన విధంగా వాటిని తయారు చేసి ఇస్తారు. దీంతో పాటు ఇంటి నిర్మాణం కోసం గడపలు, కిటికీలు, దర్వాజలు, తలుపులు, మంచం, బల్లె పీటలు, దేవుని మండపం తదితర ఫర్నీచర్లను తయారు చేస్తారు.

పట్టణాలకు పయనం

గ్రామాల్లో పనులు లేక వడ్రంగులు పట్టణాలకు పయనమవుతున్నారు. ఇప్పటికే పలువురు యువకులు పట్టణాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకొని తలుపులు, కిటికీలు, డైనింగ్ టేబుల్, బెడ్స్ లాంటివి తయారు చేస్తున్నారు. కొందరు ఫర్నిచర్ తయారు చేసే కంపెనీల్లో చిరి ఉద్యోగులుగా చేరుతున్నారు. మరికొందరు యంత్రాలను సమకూర్చుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఇక పట్టణాలకు వెళ్లలేక ఊరినే నమ్ముకున్న వడ్రంగులు ఇళ్ల వద్దే చిన్నాచితక పనులు చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. గత ప్రభుత్వం కుల వృత్తులకు చేయూతనందిస్తానని మొండి చేయి చూపిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలని వడ్రంగులు కోరుతున్నారు.

పింఛన్ అందించాలి

సుద్దాల అనంత్ రావు



ప్రభుత్వం వడ్రంగులకు బీమా సౌకర్యం కల్పించాలి. ఇలా పని చేస్తున్నసమయంలో ప్రమాదాలకు గురై చేతులు, కాళ్ల పోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి సహాయం చేయడంతో పాటు 50ఏళ్ల నిండిన ప్రతీ వడ్రంగికి పింఛను అందజేయాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

గజ్జలు బాపూజీ, సర్దాపూర్ గ్రామం



నేడు వ్యవసాయంలో యంత్రీకరణ కారణంగా మా కులవృత్తి కనుమరుగవుతోంది. చేతినిండా పని లేకుండా పోవటంతో పస్తులతో గడపాల్సి వస్తోంది. గతప్రభుత్వాలు అన్ని కుల వృత్తులవారిని ఆదుకుంటామని చెప్పి మొండి చేయి చూపాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వడ్రంగులను ఆదుకొని మా జీవితాల్లో వెలుగు నింపాలి. ఇప్పటికే పనులు దొరకక ఈ తరం పిల్లలు పట్టణాలకు వలస వెళ్తున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి అన్ని చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళ, శిశ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా శాఖ అధికారి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటుందని, దివ్యాంగుల సమస్యలపై జిల్లా అధికారులు, దివ్యాంగులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దివ్యంగా పింఛన్లపై ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందిన దరఖాస్తులపై వెంటనే స్పందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు కల్పించవలసిన పనులపై చర్యలు తీసుకుంటామని, దివ్యాంగుల ఉపాధి కొరకు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలింకో సంస్థ వారితో మాట్లాడి అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిల్ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంగవైకల్యం దేనికి అడ్డు కాదని, సంకల్పం, పట్టుదల, మనోధైర్యం ఉంటే అన్ని రంగాలలో రాణించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అలీబిన్ అహ్మద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, దివ్యాంగుల సంఘం సభ్యులు వెంకటేష్, సద్దాం ఖయ్యూం, రవిశంకర్, స్వరూప పాల్గొన్నారు.

కౌటాల : ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, ఎంఈఓ గావుడే హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలతో కలసి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది అని తెలిపారు. పిల్లలకు ఆటలు ఆడించి గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలతో కలసి కేకే కట్ చేసి, పిల్లలకు తినిపించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ గణపతి పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

నవతెలంగాణ-బెజ్జూర్



రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన ముదిరాజులు రాబోయే రోజుల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల గణనకు సంబంధించిన వివరాలను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బహిర్గతం చేయడమే కాకుండా కుల గణన ప్రాతిపాదికనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బెజ్జూర్, కౌటాల తదితర ప్రాంతాల్లో ప్రాణహిత చేవెళ్ల కోసం తవ్విన కాలువల్లో ముదిరాజ్ మత్స్యకారులకు చేపలు పట్టుకునేందుకు వీలుగా వెసులుబాటు కల్పించి కొత్త సొసైటీలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు యాటకారి భీమేష్, పులబోయిన వెంకటేష్, చిలక మల్లేష్, బొగ్గుల శంకర్, చిలుక శంకర్, బోర్ల శ్రీశైలం, యాటకారి శంకర్, ధోని రమేష్, పులబోయిన తిరుపతి పాల్గొన్నారు.

అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై వెలసిన కంకాలమ్మ కేతేశ్వర స్వామి జాతర మహోత్సవం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కృప వలన సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని సత్కరించి కంకాలమ్మ చిత్రపటాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుల్వ కనకయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మండల అధ్యక్షుడు వాను పటేల్, మండల ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ బండురావు పాల్గొన్నారు.

బూత్ స్థాయి సహాయకుల జాబితా అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి సహాయకుల జాబితాను అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్‌రావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఈ నెల 24వ తేదీలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జనవరి 6, 2025న ఓటరు తుది జాబితాలో ప్రచురించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రంలో తమ సహాయకులను నియమించి వారి జాబితాను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



శ్రీకాంతాచారి వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు తూమోజు సురేష్ చారి, రాష్ట్ర నాయకుడు శ్రీమంతుల వేణుగోపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలో శ్రీకాంత్ చారి కి గుర్తుగా కాష్య విగ్రహానికి స్థలం కేటాయించి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బట్టుపెల్లి అశోక్ చారి, శ్రీరామోజు వెంకటయ్య, నల్గొండ తిరుపతి చారి, కస్తూరి రమేష్, తిరుపతి చారి, శ్రీనివాస్ చారి, తూమోజు సాయి, కళ్యాణ్ పాల్గొన్నారు.

పులిని పట్టుకోవడంలో ఫారెస్ట్ అధికారుల అలసత్వం

నవతెలంగాన-దహెగాం



పులిని పట్టుకోవడంలో అటవీ అధికారులు పూర్తిగా అలసత్వం వహించడం సరి కాదని డీవైఎఫ్ఐ జిల్లా నాయకురాలు కుందూరపు మంజుల అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మోర్లె లక్ష్మిని కాగజ్‌నగర్ మండలం గన్నారం పత్తి చేనులో దాడి చేసి చంపేసిందని, దాని తర్వాత సిర్పూర్(టి) మండలం దుబ్బగుడా గ్రామంలో సురేష్ అని వ్యక్తిపై దాడి చేసి, ఆసిఫాబాద్ మండలం దానాపూర్ వద్ద మేకలపై దాడి చేసిందని అన్నారు. ఇంత జరుగుతున్న అధికారులు దాన్ని పట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం పులులకు సంరక్షణ కేంద్రాలకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని, రైతులు, పశువుల ప్రాణాలను కాపాడే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్, పూజ సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై బీజేపీ చార్జిషీట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ నాయకులతో కలిసి చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో చేసింది శూన్యమని, గ్రామాల్లో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే దిక్కయ్యాయనన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలన వలన ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. నూటికి నూరు శాతం రుణమాఫీ చేశామని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని ఏ గ్రామంలో కూడా పూర్తి కాలేదన్నారు. అనేక కారణాలు చెప్పి రుణమాఫీని ఎగ్గొట్టారని, రైతులు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా శంకుస్థాపన చేసిన గ్రామపంచాయతీ బిల్డింగులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం కూడా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, మాజీ వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య, నాయకులు అరుణ్, ప్రసాద్ గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వర్ వారిని అభినందించి అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతికి చెందిన విద్యార్థి ఎండీ మోహిట్, ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థిని బొమ్మన స్వప్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఇరువురు ఈ నెల 6, 7 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల ఆధ్వర్యంలో విజయోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పట్టణంలో మున్సిపాలిటీ కార్మికులు కుమురంభీం చౌక్‌తో పాటు, పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను కమిషనర్ భుజంగరావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిశుభ్రత కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శంకర్, రాజు, అనిల్, శంకర్ పాల్గొన్నారు.

కొలాంగూడ గిరిజనులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తపాలాపూర్ గ్రామపంచాయతీ అనుబంధ కోలంగూడ గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది సికిల్ సెల్, ఎనీమియా వైద్య పరీక్షలు చేశారు. మంగళవారం గ్రామంలో పర్యటించి రక్తహీనత, పోషకాహార లోపం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సందీప్, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఏఎస్ఎం మాధవి, ఆశా వర్కర్లు విజయ, లలిత పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది

నవతెలంగాణ-జన్నారం



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం శ్రీకాంతా చారి త్యాగాన్ని స్మరించుకుందామని, తెలంగాణ రాష్ట్ర సాధనలో అతను చేసిన త్యాగం వెలకట్టలేనిదని, మండలానికి చెందిన పలువురు నాయకులు, యువకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోలిచందు, ఆంద్రా పురుషోత్తం, మర్రిపల్లి అంజన్న, ప్రభంజనం పాల్గొన్నారు.

రియాజ్ అరెస్టును ఖండిస్తూ నిరసన



నవతెలంగాణ-మందమర్రి

హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డ్ అండ్ జేపీసీసీఐ శాశ్వత సభ్యుడు రియాజ్ అహ్మద్ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా మంగళవారం ఆర్కేపీ సీఎస్పీలో సింగరేణి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె శ్రీనివాస్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కోల్ బెల్ట్ వ్యాప్తంగా రియాజ్ అహ్మద్ అక్రమ నిర్బంధం గురించే చర్చిస్తున్నారని తెలిపారు. కార్మికుని గొంతుకై అవినీతిని ప్రశ్నించే ఆయుధం ఐనందుకేనా ఈ అరెస్టని కార్మికలోకం ప్రశ్నిస్తుందని అన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు వ్యాపార సంఘాలుగా మారి స్ట్రక్చర్ సమావేశంలో ఐటి, స్వంతిటి పథకం, కొత్తగనులు, కొత్తపనులు, బకాయిలు, మెడికల్, అవినీతి వంటి కీలక అంశాలను కనీసం చర్చకు పెట్టకపోవడంతో గెలిచిన సంఘాలను యజమాన్య, ప్రభుత్వ పెంపుడు సంఘాలుగా కార్మికులు భావిస్తున్నారని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఐక్య కూటమిని ఏర్పాటుచేసి కార్మికులను చైతన్య పరుస్తున్నాడనే నెపంతో పెద్దపల్లి ముఖ్యమంత్రి సభలో కార్మికుల హక్కులను ఎక్కడ అడుగుతాడో అనే భయంతో రెండు రోజులు ముందుగా నిర్బంధించడం పిరికితనం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చొప్పరి రామస్వామి, గోమాస ప్రభాకర్, అశోక్ కుమార్, ముఖేష్, థామస్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌కు గురై వృద్ధుడు మృతి చెందినట్లు భీమారం ఎస్ఐ కె శ్వేతా తెలిపారు. ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వెళ్ది గ్రామానికి చెందిన పప్పు చంద్రమౌళి(53) భీమారంలోని తన అల్లుడు అయిన రాంటెంకి రంజిత్ కుమార్ ఇంటికి గత 3 రోజుల క్రితం పని నిమిత్తం వచ్చి, మంగళవారం ఉదయం రంజిత్ కుమార్ బిల్డింగ్ నుంచి 20 ఫీట్ల సెంట్రింగ్ రాడ్లను తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్‌ను అనుకోని ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అల్లుడు రంజిత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి ఝాన్సీ తెలిపారు. మంగళవారం తాండూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం గర్భిణీలకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తార, ఏఎస్ఎం పారిజాతం, నవిత, దేవి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 88 శాతం బొగ్గు ఉత్పత్తి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో నవంబర్‌లో 88 శాతం బొగ్గు ఉత్పత్తి అయినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూగర్భ గనులలో 89 శాతం ఉత్పత్తి సాధించామని, ఉపరితల గనులలో 87 శాతం ఉత్పత్తి సాధించామని అన్నారు. మిగిలిన నెలల్లో ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తామన్నారు. గత నెలలో కార్మికుల సంక్షేమం పట్ల శ్రద్ధ వహించి డయాబెటిస్ స్క్రీనింగ్ చేపిద్దామని తెలిపారు. అలాగే అర్హులైన కార్మికులకు ప్రమోషన్లు అందజేశామన్నారు. బుధవారం జరిగే సీఎం సభలో 80 మంది నూతన కార్మికులకు నియామక పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, పీఎం రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కంపెనీ పీఈఎస్ జీఎం ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చెందిన కాంటాక్ట్ కంపెనీ పీఈఎస్ సీనియర్ జనరల్ మేనేజర్ బి తిరుమలరావు(58) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తిరుమల్ రావు సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని తన కోటర్‌కు చేరుకున్నరు. మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. తిరుమల రావు భార్య పిల్లలు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉండగా ఉద్యోగరీత్యా ఆయన ఎస్టీపీపీలో కాంటాక్ట్ కంపెనీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి సినట్టు పోలీసులు తెలిపారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. మంగళవారం ప్రజా సంఘాల నాయకుల సమావేశం శ్రీరాంపూర్ సీఐటీయు కార్యాలయంలో ఎర్మ పున్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్క ఆర్టీసీ ఉచిత ప్రయాణం తప్ప ఏది అమలులో లేదని విమర్శించారు. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. కార్మిక కోడ్‌లు వేగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుందని, ఇది అమలు చేయడం వలన కార్మికులకు కనీస వేతనం, పని గంటల పెంపు, కార్మిక హక్కులు ఉండకుండా చేసే కుట్ర జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రభుత్వం రైతంగానికి ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి పంటకు గిట్టుబాటు ధర, బోనస్ డబ్బులు చెల్లించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, ప్రకాష్, శ్రీకాంత్, అభినవ్, పున్నం, చందు, మహేష్, మోహన్, విజయ,పైరాల రాములు, అశోక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రత్యేక చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్‌లో..

నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణితో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల పరిరక్షణ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, దివ్యాంగులకు ప్రత్యేక కమ్యూనిటీ హాల్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సమస్యలపై ఆన్‌లైన్‌లో ఉన్న నెంబర్‌కు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసినట్లయితే పరిష్కారంపై ప్రత్యేక దృష్టి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంకల్పం, మనోధైర్యంతో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. అందరితో సమానంగా రాణించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. దివ్యాంగులుగా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి ఎన్నో సేవలు అందిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి పాల్గొన్నారు.

జన్నారం : దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ విజయ్ కుమార్, పలు శాఖల అధికారులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు దివ్యాంగులు విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రి : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను సింగరేణి మనోవికాస్ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏరియా జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలతో ఈ రోజు ఇక్కడ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఓపికతో శ్రమతో మానసిక వికలాంగుల పిల్లలకు చదువు చెప్పడం, పనులలో నేర్పరులుగా చేయడం, వారికి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులకు, ఆయాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలకు సింగరేణి ఉద్యోగులు కూడా సహకరిస్తున్నారని, ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడుతున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు చాలా శక్తివంతమైన వారని వారిలో ఏదో తెలియని శక్తి దాగి ఉందని దానిని వెలికి తీసి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు తల్లితండ్రులకు సూచించారు. అనంతరం రెండు రోజులుగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవై పీఎం ఆసిఫ్, మనోవికాస్ స్పెషల్ స్కూల్ ఇన్‌చార్జి సురేఖ, పేరెంట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మందమర్రి రాజలింగు పాల్గొన్నారు.



జన్నారంలో..



మందమర్రిలో..

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై ప్రకటన చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



పెద్దపల్లి పర్యటనకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కాంట్రాక్ట్ కార్మికుల వేతనల పెరుగుదలపై నిర్దిష్టమైన ప్రకటన చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం గడుస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం పెంచలేదని, ఎప్పుడు పెంచుతారో నిర్దిష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. జీఓ నెంబర్ 22 అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని సింగరేణి యాజమాన్యం లేఖ రాసి 2 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు జీఓ నెంబర్ 22 అమలుకు అవకాశం ఇవ్వక పోవడంలో ఆంతర్యం ఏమని ప్రశ్నించారు. 26 వేల మంది కాంట్రాక్టు కార్మికుల ఆకలి బాధలు రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోల్ ఇండియాలో అమలవుతున్న హై పవర్ కమిటీ వేతనాలను, జీఓ నెంబర్ 22ను కానీ అమలు చేసేలా పెద్దపల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు.

నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో ఇటీవలే రైల్వే ట్రాక్ గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల నష్ట పరిహారం చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్ కుమార్ దీపక్ అనంతరం టెకుమట్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఎమ్మెల్యే. టెకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రని ప్రారంభించి రైతులకు, అధికారులకు తగిన సూచనలు చేశారు. భీమరం మండల కేంద్రంలోని రైతు వేదికలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా హరీష్ రాజ్, ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డితో కలిసి సంక్షేమ శాఖల అధికారులలతో విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షించాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రోజు విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించి ఏమైనా మార్పు కనిపించినట్లయితే సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో దాదాపు 12 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతిగహాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాల ప్రకారం తగు వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సమన్వయకర్త నాగేశ్వర్ పాల్గొన్నారు.

పడి పూజ వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-నస్పూర్

ఈ నెల 8న ఆదివారం శ్రీరాంపూర్ కాలనీలో ప్రగతి స్టేడియంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో అయ్యప్ప స్వాముల మహా సంగమం, మహా మండల పడి పూజ, అయ్యప్ప స్వాముల అగ్ని ప్రవేశం (అగ్ని గుండాలు) కార్యక్రమం వాల్ పోస్టర్ను మంగళవారం జీఎం ఎల్వీ సూర్యనారాయణ విడుదల చేశారు. ఈ సందర్భంగా జీఎం సూర్యనారాయణ, అఖిల భారీతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాదు వీరబద్రస్వామి మాట్లాడారు. కేరళకు చెందిన సంజీవ సంభూద్రి గురుస్వామిచే ఈ నెల 8న ఆదివారం సాయంత్రం 6 గంటలకు అయ్యప్ప స్వామి మహా మండల పడి పూజ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఆర్కే-8 కాలనీలోని విఘ్నేశ్వర ఆలయం నుంచి ఆయ్యప్ప స్వాములు, 108 మంది మహిళా మాతలచే హారతి దీపారాదనలతో, నగర సంకీర్తనలతో అయ్యప్ప భక్తులచే పేటుతుల్లి నృత్యాలతో అయ్యప్ప, గణపతి, కుమారస్వామి దేవతల చిత్ర పటాలను ఆర్కె-6 గుడిసెలు, గాంధీనగర్, హిమ్మత్నగర్ల మీదుగా శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియం వరకు శోభాయాత్రగా ఊరేగింపు నిర్వహించ బడుతుందన్నారు. మద్యానం 1 గంటకు అయ్యప్ప స్వాములకు, భక్తులకు భిక్షా(అన్నదానం) కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయురాలు మృతి

నవతెలంగాణ-తాండూర్



గత రెండు సంవత్సరాలుగా జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు పరిమళ సోమవారం మృతి చెందింది. కాగజ్ నగర్, తాండూర్ ప్రస్తుతం మంచిర్యాల్ గర్ల్స్ హై స్కూల్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన పరిమళ విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఎంతో కృషి చేశారు. క్రీడల్లో ఎందరో గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఆమే కృషి చేశారు. పరిమళ ప్రోత్సాహంతో ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయిలకు ఎదిగారు. మంచిర్యాల జిల్లాలో సీనియర్ పీడీగా పనిచేసిన పరిమళకు ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి సంతానం. బెల్లంపల్లి కన్నాల బస్తికి చెందిన పరిమళ మూడు నెలలుగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయ వర్గాలు విద్యార్థులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

సమగ్ర సర్వే ఆన్‌లైన్ పనులు పూర్తి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని 29 గ్రామపంచాయతీలలో గత నెల ఆరవ తేదీ నుంచి కుటుంబ సర్వే నిర్వహించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరిగిందని ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో, కుటుంబ సర్వే పత్రాలను తీసుకొని సీల్ చేశారు. మండలంలో మొత్తం 123 మంది ఎన్యూమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్‌లు పర్యవేక్షణలో ఈ సర్వేను నిర్విఘ్నంగా కొనసాగించి, ఆన్‌లైన్‌లో పొందుపరిచారన్నారు. కొత్త మండలంలోని 29 గ్రామపంచాయతీలలో మండలంలో 18500 కుటుంబాలను సర్వే చేసి ఆన్‌లైన్ చేశామన్నారు. ఆన్‌లైన్ చేసిన పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

అట్టహాసంగా అయ్యప్ప నగర సంకీర్తన

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని అయ్యప్ప స్వాములు ఆదివారం సాయంత్రం పురవీధుల్లో నగర సంకీర్తన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్వాములు స్టేషన్ రోడ్ కాలనీలో గల అయ్యప్ప దేవాలయం నుంచి పాత బస్టాండ్ వరకు వీధులకుండా అయ్యప్ప ఉత్సవ విగ్రహ రథంతో ఊరేగింపు నిర్వహించారు. ర్యాలీలో కన్నే స్వాములు గండ దీపాలు పట్టుకొని ఊరేగారు. కరతాల ధ్వనులతో నృత్యాలతో ఊరేగింపు అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరిగింది. స్థానిక వ్యాపారస్తులు ప్రజలు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి రథోత్సవానికి స్వాగతం పలికారు. ఈ శోభాయాత్రలో స్వాములు సత్యం, రఘు, అనుదీప్ స్వాములు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 04, 2024 | www.navatelangana.com

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగిఉండాలని ఎస్సై లింబాద్రి అన్నారు. మంగళవారం డ్యాంగాపూర్ మహిళ ప్రాంగణంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలలు, చిన్నపిల్లల విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళలు ముఖ్యంగా సామాజిక మధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్‌రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, జిల్లా షీటీం సిబ్బంది, మహిళా ప్రాంగణ మహిళలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీఆర్టీల సర్టిఫికేషన్ వెరిఫికేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేజీబీవీలలో ఖాళీలను భర్తీ చేసేందుకు గత సంవత్సరం పరీక్ష నిర్వహించగా డిసెంబర్ 4న డీఈఓ కార్యాలయంలో లిస్ట్ ప్రదర్శించడం జరుగుతుందని డీఈఓ ప్రణీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1:3 పద్ధతిలో సబ్జెక్టుల వారీగా సీఆర్టీలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత సీఆర్టీలు, డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్ కోసం 4న ఉదయం అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్ రెండు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. సాయంత్రం 1.1 లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచుతామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు సమాచారం ఫోన్ల ద్వారా డీఈఓఏడీబీ.వీబ్లీ.కామ్ వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యంతరాలు డిసెంబర్ 5న 10:30 నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రుణమాఫీపై బ్యాంకు మేనేజర్‌ను నిలదీసిన రైతులు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్‌ను పల్సి(బి)తండ గ్రామ రైతులు మంగళవారం రుణమాఫీ విషయంపై నిలదీశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా వ్యవసాయశాఖ అధికారులకు కలువుమని తెలిపారు. కాగా సంబంధిత రైతులు ఏడీ కార్యాలయానికి వెళ్లి రైతుల పూర్తి వివరాలు చూడగా నో డేటా ఎంట్రీ అని వస్తుందని మీ బ్యాంకు మేనేజర్‌కు కలువుమని తెలుపగా మంగళవారం పల్సి(బి) తండ రైతులు మేనేజర్‌ను కలువగా పూర్తి డేటా పంపించామని మా దగ్గర ఎలాంటి పెండింగ్‌లో లేదని రైతులకు విన్నవించారు. కొంతమంది రైతుల పూర్తి సమాచారం సంబంధిత మేనేజర్ ఆలస్యంగా పంపినట్టు రైతులు అనుమాన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడుమనగా మేనేజర్ నిర్లక్ష్యం వహించినట్టు రైతులు తెలిపారు. ఏ శాఖలో తప్పు జరిగిందో తెలియడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు ఏ శాఖవారు పూర్తి సమాచారం ఇవ్వడం లేదని, రైతులు వాపోతున్నారు.

రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డ్ సభ్యుడిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్



రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు చోటు దక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మెన్‌గా, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ వైస్ చైర్మెన్‌గా ఉన్న ఈ కమిటీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. కమిటీలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను సభ్యులుగా నియమించారు. మూడు సంవత్సరాల పాటు ఈ కమిటీ కొనసాగుతుందని తెలిపారు. సభ్యులకు ప్రభుత్వం టీఏ, డీఏ ఇతర భత్యాలు కల్పిస్తుంది. వన్య ప్రాణి సంరక్షణకు ఈ బోర్డు ప్రభుత్వానికి సలహాలు ఇస్తూ, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే బాధ్యత కలిగి ఉంటుంది. కమిటీలో మరో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో మరో పాటు పన్నెండు మంది రాష్ట్రస్థాయి ఉన్నతా ధికారులు కూడ సభ్యులుగా ఉంటారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఈ కమిటీలో చోటు దక్కడంతో ఈ ప్రాంత సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. వన్యాప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నియామకం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేయొద్దు

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఫరెజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు, నాసా సైంటిస్టులుగా ఉన్నత స్థానంలో రాణించారని అలాంటి వసతి గురుకులాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆదరణ కరువైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఫరెజ్ అన్నారు. మంగళవారం గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా చాందా(టి), బంగారిగూడ మైనార్టీ వసతి గృహాల్లోని విద్యార్థిని విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుట్టి శివ కుమార్, ప్రశాంత్, సాజిదోద్దీన్, సలీం, అన్నెల వసంత్, రాజేష్, షోయబ్ మోసిన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధి గుర్తిస్తే మేలు

నవతెలంగాణ-నార్నూర్

ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే రోగులకు మేలు జరుగుతుందని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సూపర్‌వైజర్ చరణ్‌దాస్ వైద్యసిబ్బందితో ఇంటింటా తిరుగుతూ వ్యాధిపై సర్వే చేయించారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని అనుమానిత కేసులను గుర్తించి ఆస్పత్రిలో చికిత్స చేయించాలని కోరారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఎటువంటి భయం లేకుండా ముందు పరీక్షా చేయించుకోవాలని సూచించారు. సర్వేలో వైద్య సిబ్బంది జంగుబాయి, దుర్గే లక్ష్మి బాయి ఉన్నారు.

సీఎం కప్ పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు సీఎం కప్-2024 నిర్వహించే పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి గంగాధర్, ఎంపీడీఓ జవహర్‌లాల్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే పోటీలపై ఆయా శాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 7, 8న గ్రామపంచాయతీ వారీగా 10, 11, 12న మండలాల వారీగా 16 నుంచి 21 వరకు జిల్లా వారీగా 27 నుంచి జనవరి 2న రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సై, ఏఓలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోథ్

మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై దివ్యభారతి, మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సాయి తేజరెడ్డిలను మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పిటీసీ రాందాస్ నాక్లే, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సావాపురే విలాస్, మినక సుధాంరెడ్డి, రాజారెడ్డి, ఘనశ్యామ్ ఉన్నారు.

శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏ ఆశయం కోసం శ్రీకాంతాచారి అమరుడయ్యాడో ఆ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బస్టాండ్ ఎదుట శ్రీకాంతాచారి విగ్రహం వద్ద ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని, నివాళులర్పించారు. ముందుగా శ్రీకాంతాచారి చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా విశ్వబ్రహ్మణ సంఘం, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలామలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ కోసం త్యాగం ఒకరు చేస్తే, పదవులు ఇంకెవరో అనుభవించారన్నారు. వర్ధంతి సభల్లో గొప్పలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ఆరోపించారు. బడుగుబలహీన వర్గాల బతుకులు మరుస్తామని చెప్పి పదవులు రాగానే వారిని పట్టించుకోలేదన్నారు. శ్రీకాంతాచారి త్యాగాన్ని స్మరించుకోవడం కాదని ఆ త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలని, విశ్వబ్రహ్మణులకు పిలుపు నిచ్చారు. పీఎం విశ్వకర్మ ద్వారా బ్యాంకర్‌లతో మాట్లాడి విశ్వకర్మలోని 200 మందికి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ మలిదశ ఉద్యమ అమరవీరుడు శ్రీకాంతా చారి వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేలా చర్చించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు కిష్టయ్య, హన్మండ్లు, బండారి సతీష్, గిమ్మ సంతోష్, శ్రీలేఖ పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో...

తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పర్తి సత్యం, కోశాధికారి అనసూయ అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట విశ్వం, ఉపాధ్యక్షులు ఉదారి చిరంజీవి, కొత్తపెల్లి సంజయ్, రావుల వేణు, ఇనుగుర్తి శ్రీనివాస్, గోవర్దన్, నాయకులు కట్ట కృష్ణ, ఉదారి శేషన్న, గాలివెల్లి వెంకటస్వామి, కట్ట కిష్టయ్య పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి 15వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తెలంగాణ తొలి కాగాడ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఉద్యమకారుడు విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ కాసోజు శ్రీకాంతాచారి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం బోథ్ పట్టణ అధ్యక్షుడు రంగు రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు సౌరాల రూపేష్, సంతోష్, నరేందర్, సుధాకర్, పాపేశ్వర్ పాల్గొన్నారు.

కడెం : తెలంగాణ స్వరాష్ట్ర సాధన శ్రీకాంతాచారి చేసిన సేవలు మరువలేనిదని స్వర్ణకార సంఘం మండలాధ్యక్షులు ఎనుగుర్తి సదానందం అన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక సీతారామాలయం ఆవరణలో స్థానిక స్వర్ణకార సంఘం నాయకులతో కలిసి శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం శ్రీకాంతాచారి తన ప్రాణాలను సైతం అర్పించడాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తమ హృదయాల్లో ఉంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వట్టిమల్ల శంకర్, వినయ్, వెంకటచారి, సతీష్, ప్రహ్లాద్, రఘు ఉన్నారు.


కడెం

సీఎం కప్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



సీఎం కప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎం కప్ పోటీల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర ఇంటింటి సర్వే, ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలు సీఎం కప్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మొదట గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించి, వాటిలో విజయం సాధించిన వారికి మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. పోటీల నిర్వహణకు గ్రామాల్లో ఆట మైదానాలను గుర్తించి, పోటీలకు సిద్ధం చేయాలన్నారు. క్రీడల నిర్వహణలో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, టెంట్ సహా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ గడువును డిసెంబర్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. క్రీడల్లో అధిక సంఖ్యలో యువత పాల్గొనే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ స్థాయిలో నలుగురు సభ్యులతో కూడిన బృందానికి పంచాయతీ కార్యదర్శి చైర్మెన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో గ్రామీణ స్థాయి, 10 నుంచి 12 తేదీల్లో మండల స్థాయి, 16 నుంచి 21 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులంతా గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలోని పోటీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ 97.22 శాతం పూర్తయిందని తెలిపారు. డేటా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేజీబీవీ, వసతి గృహల్లోకి బయటి వ్యక్తులను అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. వసతి గృహ ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సీపీఓ జీవరత్నం, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఈఓ రామారావు, డీపీఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ గోవింద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాల సింహగర్జన విజయవంతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన విజయవంతమైందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలు ఆత్మగౌరవం కాపాడుకోవడానికి నిర్వహించిన సభ మాలలు తక్కువ సంఖ్యలో ఉన్నారని, రాజకీయ పార్టీలకు మనువాదులకు చెంపపెట్టు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ వారసులమైన మేము రాజ్యాంగబద్ధంగా కట్టుబడి జీవిస్తున్నామని అన్నారు. గడ్డం వివేక్ వెంకటస్వామిని విమర్శించడం తన స్థాయి కాదన్నారు. ఇప్పటికైనా మందకృష్ణ మనువాదుల నుంచి విముక్తి చెంది దళిత జాతి ప్రయోజనాలకు ప్రయత్నం చేయాలన్నారు. మాలల హక్కులను కాపాడుకోవడానికి ఎల్లవేళలా మాల సంక్షేమ సంఘం కట్టుబడి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, ఏర సుధీర్, మెట్టు ప్రహ్లాద్, సింగరి అశోక్, మొట్టె కిరణ్, రఘు, పాశం రాఘవేంద్ర, సుభాష్, ఎ.లక్ష్మణ్, మేదరి స్వామి, అర్జున్ పాల్గొన్నారు

డీఈఓ తలమల ప్రాథమిక పాఠశాల సందర్శన

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని తలమల గ్రామ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పిల్లలతో తెలుగు, ఇంగ్లీష్ చదివించారు. ఇంగ్లీష్ చదవడంలో వెనుకబడి ఉండటాన్ని గుర్తించి పిల్లలు ఇంగ్లీష్ కూడా చదువేటట్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ శాతం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పులుల దాడుల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పులుల దాడుల నుంచి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ అన్నారు. మంగళవారం గుడిహత్నూర్ మండలంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల అనేక ప్రాంతాలలో పులులు సంచరిస్తూ ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయిన్నారు. ఈ విషయంలో ఫారెస్ట్ అధికారులు, జనాలు పత్తి చేనులకు వెళ్లవద్దని చెపుతున్నారే తప్ప వాటిని ఏ విధంగా కట్టడి చేయాలనే దానిపై దృష్టి సారించడం లేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజలు ఒక వేళ తమ పనులకు వెళ్లలేకపోతే వారి జీవన ఆధారం, వారి బతుకుదేరువు అగోమచర్యంగా మారుతుందన్నారు. పులుల ప్రాణాలు కంటే కుడా ప్రజల ప్రాణాలే ముఖ్యమన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత, ఉద్యమాలు రాక ముందే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షులు టేకం భీంరావ్, ఆదివాసీ సేన నాయకులు సలాం జాకు, పేందుర్ గోవింద్‌రావ్, కుంరం విష్ణు పాల్గొన్నారు.

మహిళా శక్తి రుణాల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళా శక్తి రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక గ్రూపులకు మంజూరైన రూ. 1.26 కోట్ల మహిళా శక్తి రుణాలతో పాటు వీధి వ్యాపారులకు మంజూరైన రూ. 5.40 లక్షల రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాల రికవరీ రేటు కూడా అద్భుతంగా ఉందని, ఇదే ఒరవడిని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అంజయ్య, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు వి సునీత, స్వయం సహాయక గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

శక్తి అభియాన్ జాతీయ సదస్సు ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో ఈనెల 4 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే శక్తిఅభియాన్, ఇందిరా ఫెలోషిప్ జాతీయ సదస్సు ఏర్పాట్లను మంగళవారం ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి శక్తి అభియాన్ జాతీయ చైర్మెన్ మణిశర్మ, తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క, జాతీయ కోఆర్డినేటర్ సౌజన్య, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శివలాల్ పాల్గొంటారని తెలిపారు. సదస్సులో భాగంగా ఈనెల 5న ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండలా గ్రామంలో ఇందిరా ఫెలోషిప్ సభ్యులు పర్యటించి, మహిళల హక్కులు, వారిని రాజకీయాల్లో ప్రోత్సహించడంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ మావల మండలాధ్యక్షుడు శేఖర్ ఉన్నారు.



ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో వనభోజనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకేంద్రంలోని డిపో గ్యారేజ్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరుకాగా వివిధ రకాల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. వారు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని ఆటవిడుపుగా గడిపారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా రీజనల్ మేనేజర్ సోలోమన్, డిపో మేనేజర్ కల్పన పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. అనంతరం అందరితో కలిసి భోజనాలు చేస్తూ సందడిగా గడిపారు. కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది సైతం ఈ వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తరలిరావడం సంతోషకరంగా అనిపించిందని డిపో మేనేజర్ కల్పన తెలిపారు.

యువతులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని యువతులకు టాస్క్ ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు టాస్క్ జిల్లా మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు దీనికి అర్హులను, ఆసక్తిగలవారు ఈ నెల 4 నుండి 10 వరకు జిల్లా కేంద్రంలోని వైటిసి(పాత కలెక్టరేట్) కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9502786438, 9603430181 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని గూడెం గ్రామానికి చెందిన మండిగా సాయి(23) పెరట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం..మద్యానికి బానిసైన సాయి తాగిన మైకంలో సున్నీతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఐనం గ్రామంలో అక్రమ రవాణా కోసం అక్రమంగా నిల్వ ఉంచిన 15 కింటళ్ల పిడిఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐనం గ్రామానికి చెందిన అల్లూరి శంకర్ అక్రమంగా రవాణా చేయడానికి ఇంట్లో బియ్యం నిల్వ ఉంచారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శృతి ఉన్నారు.

బీజేపీ చార్జిషీట్ విడుదల



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాంగ్రెస్ ఏడాది పాలనపై మంగళవారం బీజేపీ చార్జిషీట్‌ను విడుదల చేసింది. స్థానిక బీజేపీ కార్యాలయంలో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ ఛార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ పాలనతో ప్రజలకు చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని అన్నారు. వంద శాతం రుణమాఫీ చేశామని చెపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సిర్పూరు నియోజకవర్గంలో ఏ గ్రామాన్నైనా ప్రామాణికంగా చేసుకొని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఏదైనా అభివృద్ధి జరుగుతుందంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, కాళిదాసు మజుందార్, ధోని శ్రీశైలం, అరుణ్‌లోయ, సిందం శ్రీనివాస్, కొప్పుల శంకర్, గజ్జల లక్ష్మణ్, వలపదాసు రమేష్, సమీర్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తప్పనిసరిగా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాంచనవల్లి రత్నాకర్ అన్నారు. మంగళవారం పలు పాఠశాలను సందర్శించి యూనిట్ రిజిస్ట్రేషన్లు చేపట్టారు. 2024-25 సంవత్సరానికి కొత్త యూనిట్ల నమోదు, పాత యూనిట్ల రెన్యువల్ చేపట్టడంలో భాగంగా రెండు రోజులుగా యూనిట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో ఈ బాలబట ఉద్యమాన్ని బలోపేతం చేసేలా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.స్వామి ఉన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-కౌటాల

రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లే పనులు చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య , నాయకులు హర్షద హుస్సేన్ పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని స్పిన్నింగ్ మిల్ వద్ద ప్రారంభించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర గుత్తేదారుడిని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని స్పిన్నింగ్ మిల్లు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలన్నారు. భూసేకరణ త్వరలో పూర్తి చేసి నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పనులు జరగాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు అశోక్ రెడ్డి, రవి ఉన్నారు.

అగ్ని ప్రమాదాలతో పర్యావరణానికి ముప్పు



కాసిపేట: అడవిలో అగ్ని ప్రమాదాలతో పర్యావరణానికి ముప్పని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ బి.ప్రవీణ్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యంపల్లి, ధర్మారావుపేట సెక్షన్ల పరిధిలోని మామిడిగూడ, పెద్ద ధర్మారం, బుగ్గగూడ, చింతగూడ, గురువాపూర్లలో అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ అటవీ రక్షణలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ లైన్లు చేయడం, ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ బ్లోవర్‌లతో నిప్పు ఆర్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాని అగ్ని ప్రమాదాలతో జరిగే నష్టం చాలా పెద్దదని, వన్యప్రాణుల ఆవాసం చెదిరి, విలువైన వృక్ష సంపద కనుమరుగవుతుందని, అందుకే అలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజల్లో చైతన్యం వస్తే అడవిలో అగ్ని ప్రమాదాలను నివారించిన వారమవుతామని తెలిపారు. పశువుల కాపరులు తమ వెంట గొడ్డళ్లు తీసుకెళ్లరాదని, చిన్న చిన్న చెట్లను మేత కోసం నరకడం నేరమని, దీనికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాలలో ఎల్బీలు శ్రీధర్, యుగేంధర్, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టుకు నిధులివ్వడానికి కేంద్రం సిద్ధం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం 60శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం 91 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ దండే విట్టల్‌తో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టు విషయంలో సంవత్సరం వృథా చేసిందని, వెంటనే ప్రాజెక్టు రిపోర్టు అందజేస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. దండే విట్టల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆర్థిక భారం కాకుండా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పకడ్బందీ ప్రణాళికతో ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలల్లో పకడ్బందీ ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇంకా కళాశాలలు 90 నుండి 100 రోజుల వరకు కొనసాగనున్నాయని, దీనికి ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. తరగతుల్లో విద్యార్థులను గుర్తించి వారు ఉత్తీర్ణత సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. 100 శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల



అధ్యాపకుడు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలని వినతి



మందమర్రి : ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ నిధులను విడుదల చేయాలని మంగళవారం ఎమ్మార్పిఎస్ నాయకులు ఎంపిడిఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు చిలుముల రాజుకుమార్ మాట్లాడుతూ 2020-21 సంవత్సరం నుండి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. ఉపాధి కొరకు అప్లై చేసుకున్న నిరుద్యోగ యువతీయువకులు నిధులు విడుదల కాకపోవడంతో నిస్సహాయ స్థితిలో వేచి చూస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చలి కిషోర్, ఆసంపల్లి అఖిల్, అనిల్ పాల్గొన్నారు.

అడ ప్రాజెక్టులో దూకి వృద్ధుని ఆత్మహత్య

ఆసిఫాబాద్ : మండలంలోని కుమురం భీం ప్రాజెక్టులో దూకి అడ గ్రామానికి చెందిన పెట్కులె భీమయ్య(76) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..భీంరావ్ కొంతకాలంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక మనస్థాపానికి గురై ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రాజెక్టులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రుక్మాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాంతాచారికి నివాళులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ ఉద్యమంలో 369 మంది ప్రాణాలు అర్పించారని, మలి దశ ఉద్యమంలో 1200 మందికి పైగా అమరులయ్యారని అన్నారు. మలి దశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన తొలి ఉద్యమకారుడు శ్రీకాంతాచారి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెండుగురె శ్యాంరావు, మొయిన్, రాజ్‌కుమార్, నక్క మనోహర్, నరేందర్, బాబర్, హన్మంతు, కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 22 మందికి పరీక్షలు నిర్వహించగా, ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అప్తమాలజిస్టు శ్రీనాథ్, శిబిరం ఇన్‌ఛార్జి గోపి పాల్గొన్నారు.

నేడు సంఘీభావ ర్యాలీ

కాగజ్‌నగర్ : బంగ్లాదేశ్ హిందువుల రక్షణ కోసం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కాగజ్‌నగర్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులు, అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు ఈ ర్యాలీ నిర్వహించనున్నామని, స్థానిక బాలభారతి హన్మాన్ మందిర్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, తెలంగాణ తల్లి చౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టంలో న్యాయం జరిగేలా చూడాలి

పెంచికల్‌పేట్ : మండలంలో పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు మండలానికి చెందిన రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో పంటనష్టం సర్వే సరిగా జరగలేదని, అసలైన రైతులకు పంట నష్టం అందలేదని తెలిపారు. సర్వే చేసిన వ్యవసాయ విస్తరణ అధికారిణి శ్రీవిద్య చేన్ల వద్దకు వెళ్లకుండానే సర్వే చేసి అనర్హులకు పంట నష్టం వచ్చేలా చేసిందని, తద్వారా పంట నష్టపోయిన రైతులకు అన్యాయం జరిగిందని వారు ఎమ్మెల్సీ ముందు వాపోయారు. ఏఈఓ శ్రీవిద్యపై చర్యలు తీసుకుని నష్టం జరిగిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.